పశు వైద్యశాలలకు మోక్షమెప్పుడో?



శిథిలావస్థకు చేరిన శాంతినగర్ పశువైద్యశాల భవనం



బూత్ బంగ్లలా దర్శనమిస్తున్న జూలెకల్ సబ్‌సెంటర్

- ఉమ్మడి వడ్డేపల్లిలో శిథిలావస్థలో పశువైద్యశాలలు
- పై కప్పులూడి ప్రమాదాలు.. పట్టించుకోని ఉన్నతాధికారులు
- రిజిస్టర్లు, మందులు తడుస్తున్నాయి..
- గ్రామాల్లో సబ్‌సెంటర్‌ల పరిస్థితి దారుణం

శాంతినగర్: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే వ్యవసాయంతో పాటు అనుబంధమైన పశుసంపద అభివృద్ధి చెందాలి. వ్యవసాయంలో పశుసంపద వల్ల కలిగే లాభాలు చాలా ఉన్నాయి. ఆర్గానిక్ ఎరువులతో పండించిన ధాన్యం తినగలిగితే రోగాల బారిన పడరని వాటిపై ఎక్కువ శాతం మొగ్గుచూపుతున్నారు. ఆర్గానిక్ పంటలు పండించాలంటే పశుసంపద ఎక్కువగా ఉండాలి. ఉమ్మడి వడ్డేపల్లి మండలంలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పశువైద్యం గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో అక్కడక్కడ ఉన్న కొద్దిపాటి పశుసంపదకు సరైన వైద్య సేవలు అందక మృత్యువాత పడుతున్నాయి. దీంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. వ్యవసాయమే కాకుండా పాడిపరిశ్రమ దెబ్బతింటోందని పాడి యజమానులు వాపోతున్నారు. ఈ విషయంపై జిల్లా పశువైద్యశాఖ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన పశువైద్యశాలల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలి. సిబ్బంది లేనిచోట కొత్తవారిని నియమించి ఉచిత మాత్రలు అందుబాటులో ఏర్పాటు చేసి పశుసంపదను కాపాడాల్సి అవసరం ఉన్నది.

ఉమ్మడి మండలంలో పశు వైద్యశాలలు

ఉమ్మడి వడ్డేపల్లి మండలంలో 6 సబ్ సెంటర్లు ఉన్నాయి. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో, వడ్డేపల్లి మండలంలో రామాపురం, కొంకల, తనగల, జూలెకల్, రాజోళి మండలంలో రాజోళి, మాన్‌దొడ్డి గ్రామాల్లో సబ్ సెంటర్లు ఉన్నాయి. వాటిలో శాంతినగర్ ప్రధాన పశువైద్యశాల, రాజోళి ప్రధాన వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. దశాబ్దాల కాలంగా వాటి గురించి కనీసం మరమ్మతులు చేయడానికి అధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదు.

పైకప్పుల నుంచి వర్షపునీరు

శాంతినగర్, రాజోళి ప్రైమరీ వెటర్నరీ సెంటర్లు శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడుతోంది. వర్షాకాలంలో వర్షపు నీరు గోడలు, భవనంలోకి చేరి రిజిస్టర్లు, పరికరాలు తుప్పుపడుతున్నాయి. జూలెకల్‌లో ఏర్పాటు చేసిన సబ్ సెంటర్ పైకప్పు పడిపోయి బూత్‌బంగ్లావలె దర్శనమిస్తోంది.

కూర్చోలేని పరిస్థితి

శాంతినగర్, రాజోళి ప్రైమరీ వెటర్నరీ సెంటర్లలో వర్షాకాలంలో కూర్చోవడానికి ఇబ్బందిగా ఉంటోంది. పరికరాలు, మందులు పెట్టుకోడానికి అవకాశం లేకుండా పోయిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరికరాలు తుప్పుపట్టాయి. ఫైళ్లు, మాత్రలు తడిసిపోతున్నాయని వాపోతున్నారు. పైకప్పు పెచ్చులూడి ఎప్పుడు పడతాయోనని భయంతో విధులు నిర్వహిస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. గతంలో శాంతినగర్ ఆస్పత్రిలో ఇద్దరు సిబ్బందిపై సిమెంట్ పెచ్చులూడి పడడంతో గాయాలపాలయ్యారు.

తనగల సెంటర్‌లో సిబ్బంది కొరత

తనగలలో సబ్ సెంటర్ ఉన్నప్పటికీ పశువైద్య సిబ్బంది లేకపోవడంతో మూగ జీవాల పోషకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పశువులకు, జీవాలకు ఏదైనా సమస్య తలెత్తితే కొంకల, శాంతినగర్‌లకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో కొత్త వాటిని నిర్మించి, సిబ్బందిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని పశుపోషకులు కోరుతున్నారు.

దూరంగా ఉంది..



మా గ్రామానికి పశువైద్యశాల చాలా దూరంగా ఉంటుంది. పశువులకు ఏదైనా జబ్బు చేస్తే రాజోళికి లేదా మాన్‌దొడ్డికి వెళ్లాల్సి ఉంటుంది. 5 నుంచి 7 కిలోమీటర్లు పశువులను తీసుకెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటోంది. వైద్యం అందేలోపు చనిపోతున్నాయి. పెద్ద తాండ్రపాడులో సబ్ సెంటర్ నిర్మించి పశు పోషకులకు న్యాయం చేయాలి.

– సురేంద్ర, పెద్ద తాండ్రపాడు, రాజోళి

భయపడుతూ విధులు నిర్వహిస్తున్నాం..



శాంతినగర్‌లోని ప్రైమరీ వెటర్నరీ సెంటర్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో నీళ్లు కారుతుంటాయి. అప్పుడప్పుడూ పెచ్చులూడి పడుతున్నాయి. ఆస్పత్రిలో విధులు నిర్వహించాలంటే భయంగా ఉంటోంది.

– డాక్టర్ పుష్పలత, వెటర్నరీ సెంటర్, శాంతినగర్

బందెర దొడ్డిలా ఉంది



జూలెకల్‌లోని పశువుల ఆస్పత్రి బందెర దొడ్డిలా ఉంది. సగం పడిపోయింది. మిగతా గది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఒక్కరే వైద్య సిబ్బంది వచ్చి సెంటర్‌లోకి వెళ్లకుండా బయటనే వైద్యం చేసి వెళ్తుంటారు. నాకు 20 గేదెలు ఉన్నాయి. తరచుగా ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది. మందులు స్టాక్ చేయడానికి వీలులేనందున శాంతినగర్‌కు వెళ్లి తెచ్చుకోవాలి. కొత్త భవనం నిర్మించి వైద్యులు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– మద్దిలేటి, గేదెల యజమాని, జూలెకల్

ప్రతిపాదనలు పంపాం

శిథిలావస్థకు చేరిన రాజోళి, శాంతినగర్‌లోని ప్రైమరీ వెటర్నరీ సెంటర్లకు, జూలెకల్ సబ్ సెంటర్ నూతన భవనాలు మంజూరు చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే భవనాలు నిర్మించి ఇబ్బందులు తొలగిస్తాం.

– వెంకటేశ్వర్లు, పశుసంవర్ధకశాఖ అధికారి, జోగులాంబ గద్వాల

క్లుప్తంగా

మండలవాసికి డాక్టరేట్



మానవపాడు: మండలంలోని అమరవాయికి చెందిన శేకుంబి రవికుమార్‌కు డాక్టరేట్ వరించింది. పాలమూరు యూనివర్సిటీలో కెమిస్ట్రీ అధ్యాపకుడిగా సేవలందిస్తున్న ఆయనకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ వచ్చినట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో రసాయనశాస్త్ర విభాగంలో ఆచార్య డీఏ పద్మావతి పర్యవేక్షణలో జరిగిన సింథసీస్ అండ్ డీపీటీ స్టడీస్ ఆఫ్‌బయాలజికల్ ఆక్టివ్‌బెంజోమెంట్స్, బెంజమైట్స్, సల్ఫోనేట్స్ అండ్ సల్ఫోనమైడ్స్ యూజింగ్ నావెల్ లూయిస్ బేస్ డీఎంఏపీ అడక్ట్స్ అనే అంశంపై విస్తృత పరిశోధన చేసినందుకు ఓయూ నుంచి డాక్టరేట్ పట్టా అందింది. ఆయన గతంలో ఎన్నో సదస్సుల్లో సెమినార్స్ ఇచ్చి మన్ననలు పొందారు. మండల వాసికి ఈ డాక్టరేట్ రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా పద్మావతి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి సెలువులో ఉండడంతో ఆ స్థానంలో ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎంపీఓ పద్మావతిని బాధ్యతలు చేపట్టాలని సీఈఓ కాంతమ్మ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. దాదాపు 15 రోజులు సెలువులో ఉండడంతో ఇన్‌చార్జీ ఎంపీడీఓగా పద్మావతి బాధ్యతలు నిర్వహించనున్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌చార్జీ ఎంఈఓ కొండారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధించిన హాజరు రిజిస్టర్‌లతో పాటు వారికి వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిశిలాక్షేత్రంలో ఆరాధనోత్సవాలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో పురంధర దాసుల ఆరాధనోత్సవాలు శుక్రవారం శేషదాసుల వారి వంశస్థులు ధీరేంద్రదాసు, రాఘవేంద్రదాసు, విష్ణుదాసులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భాజాభజంత్రీలతో స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, రమేషాచారి, రవిచారి, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, ముకుందరావు, అరవిందరావు, బాబురావు, వెంకోబరావు, పద్మారెడ్డి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతు

గద్వాలన్యూటౌన్: ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని యూనియన్ గద్వాల బ్రాంచ్ కార్యదర్శి బంగి రంగారావు తెలిపారు. సమ్మెకు మద్దతుగా శుక్రవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో ఇతర ఉద్యోగులతో కలిసి సమ్మె పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ చేస్తోందని, దీనివల్ల ప్రైవేట్ సంస్థల ఆధిపత్యం పెరిగి, ప్రైవేటీకరణ విధానాలు వేగవంతం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకట్ కిషోర్, రంగయ్య, రాజేంద్రప్రసాద్, వంశీదర్‌రెడ్డి, శివకుమార్, రాఘవేంద్ర, పద్మావతి పాల్గొన్నారు.

ఆధార్ ఇబ్బందులు తొలగించాలి

రాజోళి: ఆధార్ కేంద్రాలు ఎక్కడున్నాయో తెలియక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేవీపీఎస్ నాయకులు విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆధార్‌లో తప్పుల సవరణకు పలుచోట్ల కేంద్రాలున్నాయి కాని, కొత్తగా ఆధార్ తీసుకునేందుకు సరైన కేంద్రం లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రాజోళి, వడ్డేపల్లి మండలాల ప్రజలు గద్వాల, కర్నూల్‌కు వెళ్లి ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారన్నారు. త్వరగా రాజోళి, వడ్డేపల్లిలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

టిప్పర్లను అడ్డుకున్న రైతులు

అయిజ: మండలంలోని గుడుదొడ్డి, జడదొడ్డి గ్రామాల రైతులు శుక్రవారం భారతమాల రోడ్డు నిర్మాణానికి మట్టిని తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. రహదారులు ఏర్పాటు చేస్తే ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతుందని ఆశలు చూపి ప్రభుత్వం రైతులకు స్వల్పంగా నష్టపరిహారం అందజేసి భూములు స్వాధీనం చేసుకుందని మండిపడ్డారు. మార్కెట్‌లో ఉన్న భూముల విలవను అనుసరించి నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి ఇప్పుడు చేతులు ఎత్తివేయడం సమంజసం కాదన్నారు. భూములు కోల్పోయిన రైతులకు సంపూర్ణంగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అధికారులు రైతులను సముదాయించడంతో నిరసన విరమించారు.

అంధులకు అన్నదానం

శాంతినగర్: గద్వాల్‌లోని అంధుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు శాంతినగర్ సరస్వతి పాఠశాల కరస్పాండెంట్ దంపతులు రవి, మమతలు శుక్రవారం అన్నదానం ఏర్పాటు చేశారు. పాఠశాలలో చదువుతున్న 80 మంది అంధ విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించారు. రుచికరమైన భోజనం పెట్టిన దంపతులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శాంతినగర్ సేవా సమితి వడ్డేపల్లి సభ్యులు షేక్ అస్లాం షరీఫ్, ఆశ్రమ నిర్వాహకులు రంగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

జాంపల్లిలో ‘పల్లెకు పోదాం పద’

ధరూరు: గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గట్టేందుకు బీజేపీ చేపట్టిన ‘పల్లెకు పోదాం పద’ కార్యక్రమాన్ని శుక్రవారం మండలం లోని జాంపల్లిలో నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు వేమారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కేపీ కిష్టన్న మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశారన్నారు.మాజీ పసర్పంచు చిన్నారెడ్డి, వెంకట్రాములు, నర్సింహులు, చిన్న శీలన్న, శివారెడ్డి, సత్యారెడ్డి, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

16న సమ్మెను జయప్రదం చేయండి

శాంతినగర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఈనెల 16న చేపడుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ ప్రజాపంథా నాయకుడు జమ్మిచేడు కార్తీక్ పిలుపునిచ్చారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో గ్రామీణ భారత్ బంధ్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్, మధు, శ్రీరాములు, రాఘవేంద్ర, గోవర్ధన్, సామేలు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానించిన నాయకులు

శాంతినగర్: శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా వచ్చిన ఎస్ఐ సంతోష్‌కుమార్‌ను శుక్రవారం జెడ్పీటీసీ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. మహేష్, నరేంద్రవర్మ, శేఖర్, ప్రకాష్, ఆంజనేయులు, లక్ష్మన్, రవిగౌడ్, ముత్తు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నరసింహులు

శాంతినగర్: పాఠశాలల్లో చదివే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంఈఓ నరసింహ అన్నారు. వడ్డేపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బాలల హక్కులు బాధ్యతలు, పాఠశాల స్థాయిలో విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలు వాటి పరిష్కారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి మంచి మార్కులు సాధించాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు నిర్మల జ్యోతి, విజయసారథిరెడ్డి, ఉపాధ్యాయులు శాంతిరాజు, జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీదేవి, హెడ్‌కానిస్టేబుల్ రాజవర్ధన్‌రెడ్డి, బాలల హక్కుల సమితి నవీన్, ఆరోగ్యశాఖ భాగ్యమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు మాట్లాడలేదు?

గద్వాల అర్బన్: బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి గురించి అడగకుండా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అభివృద్ధి అని పాకులాడుతున్నారని, బీఆర్ఎస్ నాయకుల నాటకాలు ఆపాలని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 2019లో సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల అభివృద్ధికి కొన్ని ప్రతిపాదనలతో రిపోర్టు కేంద్రానికి పంపామన్నారు. అప్పుడు నీతి అయోగ్ ద్వారా ప్రతిపాదనలకు సంబంధించి రిపోర్టు సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఉభయ శాసన సభ్యులకు ఎంపీ రాములు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశామన్నారు. 2019నుంచి 2023ఎన్నికల నోటిఫికేషన్ వరకు శాసనసభ్యులకు, పార్లమెంట్ సభ్యులు ఏ మాత్రం చర్యలు



మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు మోహన్ రావు

తీసుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు ఎంపీ రాములు, స్థానిక శాసన సభ్యులు కృష్ణమోహన్‌రెడ్డి ప్రతిపక్ష పాత్ర వహిస్తూ ఢిల్లీ ఉన్నతాధికారులను కలిసి అభివృద్ధి కోసం వినతిపత్రాలు అందజేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చేసే ప్రయత్నాలు మానుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియోజకవర్గాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు రహమతుల్లా, బాల కిషన్‌రావు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించండి

అలంపూర్: పెండింగ్‌లో ఉన్న హెల్త్ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు ఇప్పించాలని శానిటేషన్ సెక్యూరిటీ పేషెంట్ కేర్ ఉద్యోగులు కోరారు. అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ హాస్పిటల్ వైద్యుడు ఫణీంద్రకు ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు శానిటేషన్ సెక్యూరిటీ పేషంట్ కేర్ ఉద్యోగులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఆస్పత్రిలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇప్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శివకుమార్, హాస్పిటల్ యూనియస్ అధ్యక్షుడు మనోజ్, నాయకులు రఫీ, నరేష్, రమేష్, సంతోష్, మహేష్,అహ్మద్, అంజి, హరికృష్ణ, పారిశుధ్య సిబ్బంది సరోజ, గోవిందమ్మ, ఎల్లమ్మ, మహబూబ్ బీ, రవి, నాగచంద్ర ఉన్నారు.



ఆస్పత్రి ఇన్‌చార్జీకి వినతి పత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు

‘గృహజ్యోతి’కి వివరాల సేకరణ

మానవపాడు: ప్రజాపాలన కార్యక్రమంలో గృహజ్యోతి కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను శుక్రవారం సేకరరించారు. మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో విద్యుత్ సిబ్బంది గృహజ్యోతికి సంబంధించిన దరఖాస్తు దారుల వివరాలు యాప్‌లో నమోదు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి గ్యాస్ ఏజెన్సీ వివరాలు, గ్యాస్ నెంబర్లను నమోదు చేశారు.

లక్ష్యంతో చదవాలి

గద్వాల అర్బన్: చిన్నప్పటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకొని వాటిని సాధించేలా చదవాలని డీసీపీఓ నర్సింహ అన్నారు. శుక్రవారం గద్వాల మండలంలో శెట్టి ఆత్మకూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. బాలలు వేధింపులకు గురైతే 100లేదా 1098కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేష్ గౌడ్, హెడ్మాస్టర్ నర్సింహారెడ్డి, ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేష్, పంచాయతీ కార్యదర్శి రేణుక, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు ఉన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

గద్వాల క్రైం: స్వచ్ఛంద సంస్థలోని పని చేస్తున్న సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాల్సిందిగా సీఐ టాటబాబు అన్నారు. శనివారం గద్వాల సీఐను లైఫ్ చేంజ్ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు పరశురాముడు, శివప్రసాద్‌లు కలిసి శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. 14 సంవత్సరలోపు చిన్నారులను గుర్తించి వారికి విద్యను అందించాలన్నారు. బాల కార్మిక, బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరి సహయ సహకారాలు ఉండాలన్నారు. స్వచ్ఛంద సంస్థల నిర్వహకులకు పోలీసు శాఖ చేయూతను అందిస్తుందన్నారు. సీఐని కలిసిన వారిలో ప్రవీణ్, అన్వేష్ ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా పురస్కారం



అలంపూర్: దేశంలో రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందించిన వారికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారాలను అందించిందని ఉండవెల్లి మండల బీజేపీ మండల అధ్యక్షుడు పిడుగు వెంకటేష్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న రావడంపై శుక్రవారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాన మంత్రి పీవీ చిత్రపటానికి పాలతో అభిషేకం చేసి కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం ‘భారతరత్న’ ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

అయిజ: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకి కేంద్ర ప్రభుత్వం ‘భారతరత్న’ ప్రకటించడంతో శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా తెలుగు రాష్ట్రాల నాయకులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల నెరవేరిందన్నారు.

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

గద్వాల అర్బన్: ఆశాలకు పెండింగ్ వేతనాలను చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి కలెక్టరేట్ ఏఓ భద్రప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. నూతన ప్రభుత్వం రెండు నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. వెంటనే ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, రిటర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల వేధింపులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు సునీత, చెన్నమ్మ, లత, విజయమ్మ, నాగేశ్వరమ్మ, సుజాత, మాధవి, కాంతమ్మ, హసీనా ఉన్నారు.



ఐడీఓసీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు

పనులు పరిశీలించిన తహసీల్దార్

ఉండవెల్లి: మండలంలోని బస్వాపురంలో స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ వెంకట్ రావ్ పనులను పరిశీలించారు. శుక్రవారం బస్వాపురం గ్రామంలోని డ్రెయినేజీ వ్యవస్థను, నర్సరీ, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని, పాఠశాలను, ఉపాధి పనులు, మిషన్ భగీరథ ట్యాంకులను పరిశీలించి ఆరా తీశారు. పనులు ఎప్పటిలాగే పూర్తి చేయాలని, గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవి దేవిక పాల్గొన్నారు.



బస్వాపురంలో నర్సరిని పరిశీలించిన తహసీల్దార్

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

అయిజ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకంలో పనిచేసే కూలీల సంఖ్య పెంచాలని డీఆర్‌డీఓ ఉమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని సెర్ప్ కార్యాలయంలో ఎంపీడీఓ సాయిప్రకాష్, ఈజీఎస్ ఏపీఓ శరత్ కుమార్‌తో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్‌డీఓ ఉమాదేవి మాట్లాడారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఆరోగ్య కరంగా ఉండాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని, షెడ్ నెట్లను ఏర్పాటు చేసుకోవాలని, తగినంత నీరు పోస్తుండాలని సూచించారు. అదేవిధంగా పూడిక తీత పనులు ముమ్మరం చేయాలని, ఉపాధి హామి పథకంలో పనిచేసే కూలీలు ప్రతి గ్రామంలో 50 మందికంటే తక్కువ కాకుండా చూడాలని పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన పెంపొందించుకోవాలి

గద్వాల అర్బన్: కుష్ఠు వ్యాధి పట్ల విద్యార్థులందరు అవగాహన పెంపొందించుకోవాలని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆర్యోగశాఖ ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా పారామెడికల్ ఆఫీసర్ మల్లికార్జున్ మాట్లాడుతూ కుష్ఠువ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకు ముందు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ క్లబ్ కన్వీనర్ వెంకటేశ్వరమ్మ, అధ్యాపకులు కృష్ణమూర్తి, సత్యన్న, కళాశాల ఏఓ మక్బూల్ అహ్మద్ ఉన్నారు.

ట్రాక్టర్, జేసీబీ స్వాధీనం

కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్, జేసీబీలను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాస్ రావు వివరాల మేరకు.. మండలంలోని మల్లాపురంతండా గ్రామ శివారు నుంచి మధ్యాహ్నం ట్రాక్టర్, జేసీబీ సహయంలో మట్టి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వెంటనే అక్కడి వెళ్లారు. మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్, జేసీబీని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మట్టి తరలిస్తున్న హనుమంతు, రంగస్పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

గట్టు: అమవాస్య సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. శుక్రవారం గట్టులోని గండి ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మాచర్లలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా పూజలు నిర్వహించారు. ఆలయం దగ్గర మాచర్లకు చెందిన పీజీ పుష్పావతి, ఉమాపతి దంపతులు వారి కుమారుడు తిరుమలేష్‌లు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించారు.



డీ బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

ఉండవెల్లి: మండలంలోని డీ బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో అమవాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఆంజనేయ స్వామికి ఆకుపూజ నిర్వహించి పుష్పాలతో అలంకరించారు. సీతారాముల విగ్రహాలను పల్లకీ సేవలో ఆలయం చుట్టూ ఊరేగించారు. జంగం రామేశ్వరమ్మ కుమారులు చంద్రశేఖర్, శైలజ దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు.

ధరూరు: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు పెద్దచింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయం, అల్వలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి, కోతులగిద్ద అరణ్ణేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు చేశారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.